ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
సోమవారం 29 జూలై 2024



ఉగ్ర గోదారి


పెదమల్లం మాచేనమ్మ ఆలయం వద్ద ముంపు


చించినాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

గోదావరి వరద జలాలు సముద్రంలోకి విడుదల చేయడంతో దిగువన వశిష్ఠ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. లంక గ్రామాలను ముంచుతూ సముద్రం వైపు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ జలాలతో పోలవరం ప్రాజెక్ట్ వద్ద వరద ముంచెత్తింది. స్పిల్‌వే 48 గేట్లను ఎత్తి వరద జలాలు విడుదల చేస్తున్నారు. ఒక్కసారిగా వరద పోటెత్తడంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 25.67 మీటర్లకు చేరింది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. వరద నీటిని సముద్రంలోకి విడుదల చేయడంతో వశిష్ఠ ఉరకలెత్తుతోంది. ఆచంట, యలమంచిలి మండలాల పరిధిలోని లంక గ్రామాలు నీట మునిగాయి. నరసాపురం పట్టణంలోకి వరద నీరు చొచ్చుకువచ్చింది. వరద ఉధృతిని మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ నాగరాణి, అధికారులు పర్యవేక్షించి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

- మునిగిన లంక గ్రామాలు
- రహదారులు జలమయం.. ఇళ్ల చుట్టూ వరద
- ముంపులో పశువులు..
- కూరగాయల తోటలు మునక
- ముంపు గ్రామాలు పరిశీలించిన మంత్రి నిమ్మల, కలెక్టర్ నాగరాణి
- సహాయక చర్యలకు ఆదేశం

ధవళేశ్వరం బ్యారేజి నుంచి నీటి విడుదలతో పోటెత్తిన వశిష్ఠ

ఆచంట/పెనుగొండ/యలమంచిలి/నరసాపురం/పోలవరం/కుక్కునూరు, జూలై 28: పోలవరంలో గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. ధవళేశ్వరం బ్యారేజి నుంచి వరద జలాలను సముద్రంలోకి విడుదల చేయడంతో వశిష్ఠ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. పెనుగొండ మండలం సిద్ధాంతం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆచంట మండలం పెదమల్లం వద్ద మాచేనమ్మ ఆలయం, లంకగ్రామాలు, యలమంచిలి మండలంలో లంక గ్రామాలు నీట మునిగాయి. నరసాపురం పట్టణంలోని పలు కాలనీల్లోకి వరద నీరు చేరింది.

పోలవరం వద్ద పెరిగిన నీటిమట్టం

పోలవరం ప్రాజెక్ట్ వద్ద ఆదివారం నీటిమట్టం 24.757 మీటర్లకు చేరుకుందని, 12,53,682 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. భద్రాచలం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు 49.70 అడుగులకు చేరింది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 25.67 మీటర్లకు చేరడంతో 14,83,000 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు ధవళేశ్వరం బ్యారేజి డీఈఈ రమేష్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న వరద జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కుక్కునూరు మండలంలో పలు గ్రామాల్లోకి వరదనీరు చొచ్చుకొచ్చింది. దాదాపు 25 కుటుంబాలను కుక్కునూరు ఎ బ్లాక్ నుంచి చివ్వాక పునరావాస కాలనీకి తరలించారు.

లంక గ్రామాల్లో ఆందోళన

వశిష్ఠ గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో గంట గంటకు ప్రవాహం పెరుగుతోంది. ఆచంట మండలంలోని అయోధ్యలంక, పుచ్చల్లంక, మర్రిమూల, పెదమల్లం లంక, పల్లిపాలెం లంక గ్రామాలు నీట మునిగాయి. పెదమల్లం మాచేనమ్మ ఆలయంలోకి వరద నీరు చేరింది. రెండు రోజుల క్రితం గోదావరి శాంతించడంతో ఊపిరి పీల్చుకున్న లంకవాసులు తిరిగి ఒక్కసారిగా పోటెత్తడంతో ఆందోళన చెందుతున్నారు.

నీట మునిగిన లంకలు

యలమంచిలి మండలం కనకాయలంక, పెదలంక గ్రామాల్లో వరద నీరు ఇళ్ల చుట్టూ చేరింది. యలమంచిలి లంక, బాడవ ప్రధాన రహదారి, దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం, పల్లిపాలెం ప్రాంతాలు నీట మునిగాయి. బూరుగుపల్లి, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక గ్రామాల్లో ఏటిగట్టుకు లోపల కొబ్బరితోటలు జలమయం అయ్యాయి. వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. లంకభూముల్లో పశువులను, కొబ్బరి రాశులను రైతులు తరలిస్తున్నారు.

నవరసపురం, పొన్నపల్లిలో వరద

నరసాపురం వద్ద వశిష్ఠ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వరద జలాలు సముద్రంలోకి విడిచిపెట్టడంతో నీటమట్టం గంట గంటకు పెరుగుతోంది. ఇప్పటికే పిండాల రేవు, బాపు ఘాట్, వలంధర్‌రేవు నీట మునిగాయి. పట్టణంలోని పొన్నపల్లి, నందమూరికాలనీ, లాకుపేట కాలనీల్లోకి నీళ్లు చేరాయి. ఇరిగేషన్ కార్యాలయం వద్ద కాల్వ పొంగి లాకుపేటలోకి చేరింది. గోదావరి పరీవాహక ప్రాంతంలోని కాలనీల్లోకి నీరు చేరింది. మండలంలోని కొత్త, పాత నవరసపురం గ్రామాల్లోకి వరద పోటెత్తింది. ఈ రెండు గ్రామా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.


సిద్ధాంతం వద్ద గోదావరి ఉధృతి


నరసాపురం వలంధర్ రేవు


వద్దిపర్రులో చెరువులను తలపిస్తున్న వరిచేలు

నక్కల డ్రెయిన్‌కు గండి

పోడూరు, జూలై 28: గోదావరికి వరద పోటెత్తడంతో నీరు ఎగదన్ని నక్కల డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. డ్రెయిన్ గట్లు బలహీనంగా ఉన్న చోట్ల గండ్లు పడుతున్నాయి. వద్దిపర్రు వద్ద రెండు చోట్ల గండి పడడంతో వరద నీరు ఇళ్లల్లోకి చేరింది. రెవెన్యూ, పంచాయతీ అధికారులు, స్పందించి వరద నీరు ఇళ్లలోకి రాకుండా చర్యలు చేపట్టారు. ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేస్తున్నారు. ఇప్పటికే కాలనీలో ముంపులో ఉండడంతో 30 కుటుంబాల వారికి గ్రామంలో పునరావాసం కల్పించారు. అధికారులు వారికి భోజనం వసతులు కల్పిస్తున్నారు. రెండు రోజులు నుంచి నక్కల డ్రెయిన్ ఉధృతి పెరగడంతో శివారు కాలనీల్లోకి వరద నీరు చేరుతుంది. ఇళ్లు మునుగుతాయని కాలనీవాసులు భయపడుతున్నారు. తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్ఐ కందులు రాంబాబు, సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ విప్పర్తి శారద, శీలం శ్రీనివాసరావు, కార్యదర్శి కడలి సుజాత ముంపు ప్రాంతాల్లో పర్యవేక్షిస్తున్నారు.


జగన్నాథపురంలో రైతులతో ట్రైనీ కలెక్టర్లు

ట్రైనీ కలెక్టర్ల పరిశీలన

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 28: తాడేపల్లిగూడెం మండలంలోని ఎర్రకాలువ ముంపు ప్రాంతాలను ఆదివారం ట్రైనీ కలెక్టర్లు పరిశీలించారు. నందమూరు, ఆరుళ్ల, జగన్నాథపురం గ్రామాల్లో ఎర్రకాలువ వరదకు పాడైపోయిన పంట చేలను పరిశీలించారు. శిక్షణ కలెక్టర్లు ఎస్.నోక్వల్, డి.హేమ వంశీ, పవర్ స్వప్నీల్, జగన్నాథ్ రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీడీవో ఎస్ఎస్.శర్మ, తహసీల్దార్ మురళీకృష్ణ, ఏవో ఆర్ఎస్ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

లంక గ్రామాల్లో పాఠశాలలకు సెలవు

భీమవరంటౌన్, జూలై 28 : గోదావరి వరద కారణంగా లంక గ్రామాల్లో పాఠశాలలు, అంగన్వాడీలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆదివారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ మీకోసం రద్దు చేసినట్లు తెలిపారు.


పడవపై కనకాయలంక వెళుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రభుత్వం అండ : మంత్రి నిమ్మల

యలమంచిలి, జూలై 28: మండలం కనకాయలంక, పెదలంక గ్రామాల్లో జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం పర్యటించారు. కనకాయలంక పరిధిలోని మర్రిలంకలో వరదలో చిక్కుకున్న సుమారు 100 పశువులను ఆయన రక్షించారు. మర్రిలంక ప్రాంతంలో పశువులు చిక్కుకుపోయాయని స్థానికులు విన్నవించడంతో రామానాయుడు స్పందించి బోటుపై ఆ ప్రాంతానికి వెళ్లి వరదల్లో చిక్కుకున్న సుమారు 100 పశువులను రైతులతో కలిసి మర పడవలపై సురక్షిత ప్రాంతానికి తరలించారు. కనకాయలంక, పెదలంక గ్రామాల్లో వరద బాధితులకు ప్రభుత్వ సాయంగా 25 కిలోల బియ్యం, నిత్యావసరాలను మంత్రి అందజేశారు. సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా లంక గ్రామాల్లో వరద నీరు పూర్తిగా తగ్గి సాధారణ పరిస్థితులు వచ్చేవరకు అధికారులంతా క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. ముంపు గ్రామాల్లో వైద్యశిబిరాలతో పాటు గర్భిణులు, రోగులను దగ్గర్లోని ఆసుపత్రుల్లో చేర్చుతున్నామన్నారు. అధికారులు, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి నిమ్మల భరోసా ఇచ్చారు. తహసీల్దారు సీహెచ్.విజయశ్రీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, పెదలంక సర్పంచ్ తాళ్ల నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ఆచంట, జూలై 28: వరదకు నీట మునిగిన మర్రిమూల, అయోధ్యలంక గ్రామాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదివారం పరిశీలించారు. గోదావరి వరద ఉధృతి అంతంకతకు పెరుగుతుండడంతో కలెక్టర్ కోడేరు రేవు నుంచి పడవపై అయోధ్యలంక, మర్రిమూల ప్రాంతాలకు వెళ్లారు. గృహాలను తాకిన వరదను కలెక్టర్ పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో మోటారుసైకిల్, ట్రాక్టర్‌పై వెళ్లారు. అంగన్‌వాడీలో వైద్య శిబిరాలను పరిశీలించి ఎవరైనా అనారోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మర్రిమూల, అయోధ్యలంకలో ప్రతీ ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. వరది ఉధృతి పెరుగుతుందని, పునరావాస కేంద్రాలకు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ముంపు బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేయనున్నట్లు తెలిపారు. తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, పశుగ్రాసం లేక మూగ జీవాలు అల్లాడిపోతున్నాయని, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని స్థానికులు కలెక్టర్‌కు తెలిపారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా వాటర్ ప్యాకెట్లు అందజేయాలని అధికారులను ఆదేశించారు. పశుగ్రాసం అందిస్తామన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్, తహసీల్దార్ ఐపీశెట్టి, ఎంపీడీవో నరసింహప్రసాద్, అధికారులు ఉన్నారు.


అయోధ్యలంకలో ట్రాక్టర్‌పై వెళుతున్న కలెక్టర్, ఆర్డీవో


చించినాడ వశిష్ఠ వారధి

వారధిపై పగుళ్లు

- చించినాడ బ్రిడ్జిపై గోతులు
- పైకిలేచిన ఇనుప చువ్వలు


పగిలిన కాంక్రీట్




వంతెనపై మట్టి

యలమంచిలి, జూలై 28: పశ్చిమ గోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలను అనుసంధానిస్తూ చించినాడ - దిండి గ్రామాల మధ్య వశిష్ఠ వారధిపై పగుళ్లు వాహనదారులను భయపెడుతున్నాయి. నిర్వహణలో నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి కావడంతో బ్రిడ్జిపై నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బ్రిడ్జిపై పలుచోట్ల పెద్ద ఎత్తున గోతులు ఏర్పడ్డాయి. గోతుల్లో ఇనుప చువ్వలు పైకితేలి ప్రమాదకరంగా ఉన్నాయి. రహదారిపై ఎక్కడ చూసినా కాంక్రీటు పగుళ్లతో అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది. వాహనదారులు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. రాత్రి సమయాల్లోనూ, వర్షం పడినపుడు నీరు గోతుల్లో చేరి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫుట్‌పాత్‌ను అనుకుని చెత్త, మట్టి పేరుకుపోయి వర్షం వస్తే బ్రిడ్జిపై మడుగును తలపిస్తోంది. సుమారు పది రోజుల క్రితం కొన్ని గుంతలను పూడ్చినా కొద్దిరోజులకే కంకరరాళ్లు లేచాయి. బ్రిడ్జిపై సోలార్ విద్యుత్ దీపాలు వెలగడం లేదు.

2019 ముందు వెంచర్లకే క్రమబద్ధీకరణ

గ్రామాల్లో నాన్ లేఅవుట్



- రుసుము చెల్లించేందుకు వెసులుబాటు
- గత ఐదేళ్లలో ఇష్టారీతిన నిబంధనలు
- లేఅవుట్ వేసేందుకు వెనుకడుగు
- 2019 తర్వాత వెంచర్లకు అవకాశం ఇవ్వాలి
- రియల్టర్లు, కొనుగోలుదారుల ఎదురుచూపు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పంచాయతీలకు ఆదాయం తెచ్చిపెట్టే ఉద్దేశంతో నాన్ లేఅవుట్‌లను క్రమబద్ధీకరించుకోవచ్చవని గతంలో వైసీపీ ప్రభుత్వం అవకాశం కల్పించింది. నిర్మాణాలు చేపట్టాలంటే నిర్ణీత రుసుము చెల్లించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే 2019 ముందు వేసిన నాన్ లేఅవుట్‌లకు మాత్రమే అవకాశం అంటూ మెలికపెట్టారు. ఆ తర్వాత వేసిన వెంచర్లకు అవకాశం ఇవ్వలేదు. ప్రభుత్వం అవకాశం ఇచ్చినా గత ఐదేళ్లలో ఇష్టారీతిన నిబంధనలు విధించడంతో ఆయా లేఅవుట్‌లలో రియల్టర్లు, స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇంటి నిర్మాణాలకు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో రియల్టర్లలో జోష్ నెలకొంది. నిర్మాణాలకు ముందుకు వస్తున్నారు. ఇప్పటికీ గత ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2019 తర్వాత వెంచర్లలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వడానికి అధికారులు వెనుకాడుతున్నారు. దాంతో పల్లెల్లో నిర్మాణ రంగం దెబ్బతింటోంది.

గడచిన ఐదేళ్లలో లేవుట్‌లు వేసేందుకు నిర్మాణదారులు ఎవరూ సాహసించలేదు. పట్టణాలకు ఆనుకుని ఉన్న గ్రామాల్లోనే ఇప్పుడు రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందుతోంది. సమీప గ్రామాలన్నీ పట్టణాల వరకు విస్తరించాయి. సరిహద్దులు కలిసిపోయాయి. పల్లెవాసులు కూడా తమ చిరునామాలో పట్టణ పేర్లనే చెబుతున్నారు. భీమవరం పట్టణానికి విస్సాకోడేరు, రాయలం, తాడేరు. చినఅమిరం గ్రామాలు కలిసిపోయాయి. ఆ గ్రామాల పరిధిలో అపార్ట్‌మెంట్‌లు నిర్మిస్తున్నారు. తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం పట్టణాల పరిధిలో సమీప గ్రామాల్లో నాన్ లేఅవుట్‌లు వెలిశాయి. అనుమతులు పొందాలంటే నానా ప్రయాసలు పడాల్సి వస్తోంది. దాంతో అనధికార వెంచర్లు వేస్తున్నారు. అక్కడ నిర్మాణాలు చేపట్టాలంటే క్రమబద్ధీకరణ తప్పనిసరి. అప్పుడే నిర్మాణాలకు ప్లాన్ మంజూరు చేస్తారు. 2019 ముందు నాటి వెంచర్లకు మాత్రమే అనుమతులు ఇస్తున్నారు.

కూటమి పాలన.. రియల్ వ్యాపారుల్లో కదలిక

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో కదలిక వచ్చింది. నిర్మాణదారులు ముందుకొస్తున్నారు. ఇతర రంగాల్లో వ్యాపారాలు చేసుకునేవారు కూడా సొంత స్థలాల్లో నిర్మాణాలకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పుడిప్పుడే నిర్మాణాలపై దృష్టి సారిస్తున్నారు. గత ఐదేళ్లలో రియల్ ఎస్టేట్ రంగానికి చేదు అనుభవం మిగిలింది. వ్యాపారాలు స్తంభించిపోయాయి. నిర్మాణాలు చేపట్టాలంటే వైసీపీ నేతలకు ముడుపులు చెల్లించాల్సి వచ్చేది. అదే వెంచర్లు అయితే ఎకరానికి రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు వసూలు చేశారు. ప్రభుత్వం మారడంతో నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నా నిబంధనలు అడ్డు తగులుతున్నాయి. నాన్ లేఅవుట్‌లలో నిర్మాణాలకు రుసుము చెల్లిస్తే ప్లాన్ ఇస్తామన్న మార్గదర్శకాలను కేవలం 2019 వరకే వర్తింపజేశారు. ఆ తర్వాత నాన్ లేఅవుట్‌లను క్రమబద్ధీకరించడానికి పంచాయతీలకు అవకాశం లేకుండా పోయింది.

క్రమబద్ధీకరణ రుసుము ఇలా..

వాస్తవానికి లేఅవుట్ నిర్మాణదారులకు లాభదాయకం. వైసీపీ పాలనలో నానా రకాల నిబంధనలతో బెంబేలెత్తిపోయారు. పేదల ఇళ్లకోసం 5 శాతం స్థలాన్ని ప్రత్యేకంగా కేటాయించాంటూ ఒక దశలో వైసీపీ ప్రభుత్వం జీవో జారీచేసింది. వెంచర్‌లో కాకపోయినా ఇతర చోట్ల అయినా ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధన నిర్మాణరంగాన్ని చావుదెబ్బ తీసింది. జిల్లాలో రియల్ ఎస్టేట్ పతనానికి కారణమైంది. మరోవైపు క్రమబద్ధీకరణ వెసులుబాటు కూడా 2019కి పరిమితం చేశారు. పది శాతం స్థలానికి బదులుగా వెంచర్ విలువలో 14శాతం పంచాయతీలకు చెల్లించాలి. 30 అడుగుల లోపు రహదారి ఉంటే రెండువైపులా సరిపడా స్థలాన్ని పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలి. 100 మీటర్లు అయితే ప్రతి మీటరు స్థలానికి రూ.200 వంతున లెక్క కట్టి 33శాతం రుసుము చెల్లించాలి. అప్పుడే నిర్మాణానికి ప్లాన్ మంజూరు చేస్తారు. 100 నుంచి 300 మీటర్ల వరకు రూ.400, 500 మీటర్ల వరకు రూ. 600, ఆ తర్వాత రూ.750 వంతున లెక్కకట్టి 33 శాతం రుసుముతో నిర్మాణదారులకు ప్లాన్‌లు మంజూరు కానున్నాయి. 2019 తర్వాతి వెంచర్లకు కూడా అవకాశం కల్పిస్తే గడచిన ఐదేళ్లలో వెలిసిన నాన్ లేఅవుట్‌లలో నిర్మాణాలకు అవకాశం ఉంటుంది. పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. నిర్మాణ రంగానికి పూర్వ వైభవం రావాలంటే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్న వాదన బలంగా వినిపిస్తోంది.

ఇంటర్ విద్యార్హతతో ఉద్యోగ అవకాశం

భీమవరంటౌన్, జూలై 28: ఇంటర్మీడియట్ బోర్డు, హెచ్‌సీఎల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్హతతో ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ వచ్చే నెల 1న జరుగుతుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తాడేపల్లిగూడెం వాసవి జూనియర్ కళాశాలలో పరీక్ష, ఇంటర్వ్యూ, ఇంగ్లీష్ కమ్యూనికేషన్‌పై పరీక్ష నిర్వహిస్తారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఏడాది శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో నాలుగో నెల నుంచి నెలకు రూ.10 వేల చొప్పున స్టైపెండ్ కూడా అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. ఏడాది పాటు శిక్షణ పూర్తి కాగానే హెచ్‌సీఎల్ టెక్నో కంపెనీలోకి ఉద్యోగం కల్పిస్తారని, ఏడాది వేతనం 1.7లక్ష రూపాయలు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. వివరాలకు 9642973350 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

తెల్లారిన బతుకులు

కాకినాడ జిల్లా మురారి వద్ద అదుపు తప్పిన బైక్
భీమవరం మండలం తాడేరు వాసుల దుర్మరణం
ముగ్గురు కుమారుల మృతి.. తల్లి పరిస్థితి విషమం

7

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు


ఆర్డీవో ఖాజావలీ

ఏలూరు రూరల్/భీమవరం ఎడ్యుకేషన్, జూలై 28:ఏలూరులో ఆదివారం జరిగిన ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు 101 మంది అభ్యర్థులు హాజరు అయ్యారని ఏలూరు ఆర్డీవో ఎస్.ఎస్.కె ఖాజావలీ తెలిపారు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ఏలూరు జిల్లాలోని ఏలూరు సిద్ధార్థ ఫెస్ట్ సీబీఎస్ఈ పాఠశాలలో ఆగస్టు రెండో తేదీ వరకు జరుగుతాయన్నారు. తొలిరోజు ఉదయం జరిగిన పరీక్షల్లో 119 మంది అభ్యర్థులకు 101 మంది హాజరు అయ్యారని, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 132 మంది అభ్యర్థులకు 108 మంది హాజరయ్యారన్నారు. పశ్చిమ గోదావరి జిలా భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ అటానమస్ పరీక్ష కేంద్రంలో 90 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 78 మంది పరీక్షకు హాజరై 12 మంది గైర్హాజరయ్యారు.


బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికైన జట్ల క్రీడాకారులు

ఉమ్మడి పశ్చిమ జిల్లా బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక

వీరవాసరం, (భీమవరంటౌన్), జూలై 28:వీరవాసరంలోని మద్దాల రామ కృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఉమ్మడి పశ్చిమ జిల్లా పురుషులు, మహిళల బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లాలో పలు ప్రాంతాల నుంచి 30 మంది మహిళలు 40 మంది పురుషులు పాల్గొన్నారని పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహాయక కార్యదర్శి పి.ఎస్.ఎన్. మల్లేశ్వరరావు తెలిపారు.

మహిళా జట్టు.. బి.సౌమ్యశ్రీ (తణుకు), సీహెచ్.మానస (మాముదురు), ఎం.మరియ (పి.ఎం.లంక), ఎస్.గౌరి (శ్రీవాసవికాలేజ్, తాడేపల్లి గూడెం), గులిపల్లి స్వాతి (వీరవాసరం), కె.రాజశ్రీ (శ్రీవాసవి కాలేజ్, తాడేపల్లి గూడెం), స్టాండ్ బై.. ఎ.అంజలీదేవి (భీమవరం), జి.ఉమాదేవి (నరసాపురం) ఎంపికైయ్యారు.

పురుషుల జట్టు.. ఎస్.సాగర్ (మండపాక), డి.విల్సన్ (గునుపూడి), పి.అనోజ్ (గునుపూడి), ఎ.ఆనంద్(భీమవరం), పి.ఫణి(వీరవాసరం), ఎం.దుర్గారావు (ఉండి) ఎంపికయ్యారు. ఎంపికైన ఇరు జట్లు నెల్లూరు జిల్లా, కోవూరు మండలం, ఇందుకూరి పేటలో వచ్చేనెల 2,3 తేదీల్లో జరగనున్న 11వ రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారు. ఈ ఎంపికలలో వ్యాయామ విద్య ఉపాధ్యాయులు బాజింకి శ్రీనివాసరావు, మహ్మద్ ఖుద్దుస్, కె.కృష్ణారెడ్డి, బి.జాన్సన్, బాజింకి గంగామహేష్ ఉన్నారు.

'పశ్చిమ'లో 15,301 ఎకరాల్లో దెబ్బతిన్న పంట

▸ ముంపు నష్టంపై మంత్రులకు వివరించిన మార్టేరు శాస్త్రవేత్తలు

పెనుమంట్ర, జూలై 28 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పశ్చిమ గోదావరి జిల్లాలో ఇప్పటివరకు నమోదైన అంచనా ప్రకారం మొత్తం 1422 ఎకరాల్లో నారుమళ్లు, 15,301 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి. సత్యనారాయణ, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ టి.శ్రీనివాస్ తెలిపారు. గత రెండు రోజులుగా ఉభయగోదావరి జిల్లాల్లో కొనసాగుతున్న మంత్రుల పర్యటనలో భాగంగా తణుకు నగరపాలక కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం వరి విస్తీర్ణం 2.39 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 1.08 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని, మిగిలిన విస్తీర్ణంలో నాట్లు వేయాల్సి ఉందన్నారు. తొలుత నాట్లు వేసిన తాడేపల్లిగూడెం, తణుకు చుట్టుపక్కల గ్రామాల్లో పంట 25 నుంచి 40 రోజుల వయసు ఉండగా ఎర్రకాలువ ముంపు వల్ల చాలాచోట్ల పంట దెబ్బతిందన్నారు. పంట ఏడు రోజులకుపైగా నీట మునగడం వల్ల పంట కుళ్లిపోయే అవకాశం చాలా ఎక్కువ అన్నారు. స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1010, 1156, 1153, 1293 లేదా పీఆర్ 126 వంటి రకాలను మళ్లీ వేసుకోవడం వల్ల పంటకాలం నష్టపోకుండా ఉండే అవకాశం ఉందన్నారు. రెండు, మూడు రోజుల ముంపునకు గురై నీరు లాగేసే పొలాల్లో త్వరగా నిలదొక్కుకోవడానికి 20 కిలోల పొటాష్, 15 కిలోల యూరియాను నీరు లాగేసిన తరువాత చేనుకు వేయాలని సూచించారు.


శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో యాత్రికుల రద్దీ

మార్మోగిన గోవింద నామస్మరణ

▸ ఆలయానికి 15 వేల మందికిపైగా భక్తులు

ద్వారకాతిరుమల, జూలై 28: గోవిందా... గోవిందా అంటూ గోవిందుని నామాలతో శ్రీవారి క్షేతం మార్మోగింది. ఆదివారం సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మికత వెల్లువిరిసింది. ఆలయానికి దాదాపు 15 వేల మంది పైబడి యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్టు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. ఆలయానికి వచ్చి వారు ముందుగా కేశఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. శ్రీవారి సాధారణ దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది.


దాత కృష్ణంరాజు కుటుంబానికి బాండు అందిస్తున్న ఏఈవో దుర్గారావు


దాత వెంకటరత్నంకు బాండు అందచేస్తున్న ఈవో త్రినాథరావు

శ్రీవారి ట్రస్టుకు రూ.6.10 లక్షల విరాళం

ద్వారకాతిరుమల, జూలై 28: చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా రూ.6.10లక్షలను విరాళంగా అందజేశారు. దీనిలో భాగంగా గుంటూరుకు చెందిన ఆలపాటి వెంకటరత్నం, శివనాగేంద్ర ప్రతీ రోజూ తమపేరున అన్నప్రసాద వితరణ జరపాలని రూ.5 లక్షలను డీడీ రూపేణా ఈవో త్రినాథరావుకు అందించారు. స్వామి వారి దర్శన అనంతరం ఆయనకు బాండును ఈవో అందజేశారు. కాళ్ల మండలం ఏలూరుపాడుకు చెందిన మంతెన అహోబల కృష్ణంరాజు రూ.1.10 లక్షలను అన్నప్రసాద ట్రస్టుకు విరళం ఇవ్వగా వీరి కుటుంబానికి ఏఈవో దుర్గారావు బాండును అందించారు.

అపస్మారక స్థితిలో హాస్టల్ బాలిక

▸ అనుమానాస్పదంగా మిషనరీ హాస్టల్ వ్యవహారం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 28: తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ హాస్టల్ బాలిక అపస్మారక స్థితిలో ఏరియా ఆసుపత్రికి ఆదివారం రాత్రి చేరడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ బాలిక ఒంటి నిండా పసుపు రాసి స్పృహ లేకుండా ఉండడంతో ఆసుపత్రి వర్గాలు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బాలికను ఆసుపత్రికి ఓ వ్యక్తి మహిళా కేర్ టేకర్ లేకుండా తీసుకురావడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తుంది. ఆ బాలిక ఉంగుటూరు ప్రాంతానికి చెందినదని, ప్రస్తుతం తాడేపల్లిగూడెం గాల్స్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నట్టు హాస్టల్ నిర్వాహకులు చెబుతున్నారు. గతంలో కూడా ఈ హాస్టల్‌లో ఓ బాలికపై లైంగిక వేధింపులు జరిగినట్టు పలు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తెల్లారిన బతుకులు

ముగ్గురు కుమారుల మృతి.. తల్లి పరిస్థితి విషమం

▸ కాకినాడ జిల్లా మురారిలో ఘోర రోడ్డు ప్రమాదం

▸ బైక్ అదుపు తప్పి పడిపోవడంతో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన వైనం !

▸ తాడేరు గ్రామస్థుల దుర్మరణం


తల్లి దుర్గ

గండేపల్లి, జూలై 28: కూలి పనులు చేసుకుంటే కానీ పూటగడవని కుటుంబాన్ని మృత్యువు కబళించేసింది. కూలి పనులకు వెళ్లి తిరిగి సొంతూరుకు వస్తుండగా మృత్యువు గుర్తు తెలియని వాహన రూపంలో వచ్చి ముగ్గురినీ బలితీసుకోగా మరో మహిళ అపస్మారక స్థితికి చేరుకుంది. వివరాలివి.. భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన నంగలం దుర్గ తన కుమారులైన నంగలం రాజు(20), నంగలం యేసు(18), నంగలం అఖిల్(10) సొంతూరులో ఉపాధి లేక అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా కుంతలం గ్రామానికి ఈనెల 17న ఉపాధి నిమిత్తం పామాయిల్ గెలలు కోయడానికి వెళ్లారు. అక్కడ పది రోజులపాటు పనిచేసుకుని తిరిగి తమ సొంతూరుకు శనివారం సాయంత్రం 6.30కు తల్లితో పాటు ముగ్గురు కుమారులు పల్సర్ బైక్‌పై బయలుదేరారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామశివారునకు వచ్చేసరికి ప్రమాదం జరిగింది. అప్పటికే చినుకులు పడడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా గుర్తుతెలియని వాహనం వారి మీద నుంచి వెళ్లిపోయినట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు కుమారులు అక్కడికక్కడే మృతి చెందడంతో మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఈ విషయం హైవే మొబైల్ సిబ్బంది రాముకు తెలియగానే గండేపల్లి ఎస్ఐ ఎస్.రామకృష్ణ, జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావుకు సమాచారం అందించారు. హుటాహుటిన సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన దుర్గను 108లో రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే పడి ఉన్న మృతదేహాలను పరిశీలించి ప్రమాద ఘటనపై సమాచారం సేకరించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి సీఐ ఎస్.లక్ష్మణరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఒకేసారి మృతి చెందడంతో ఆ దారిలో వెళ్లేవారిని సైతం కంటతడి పెట్టించింది.


తాడేరులో బాధితుల ఇల్లు

ప్రమాదఘటనపై విచారణ చేస్తున్నాం : జగ్గంపేట సీఐ లక్ష్మణరావు

ఈ ప్రమాద సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ వేగవంతం చేశాం. పల్సర్ బైక్ వర్షానికి అదుపుతప్పి ప్రమాదం జరిగి ఉండవచ్చు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చే గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొట్టి ఉండవచ్చు. దీనిపై పూర్తిస్థాయిలో నిర్ధారించాల్సి ఉంది. త్వరగా విచారణ చేసి వాహనాన్ని పట్టుకుంటామని, జాతీయరహదారి వెంబడి సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నామన్నారు.


మృతుల ఇంటి వద్ద స్థానికులు, బంధువులు

చేతికి అందిన మనుమలు ఇక లేరు



ఈ వయస్సులో ఇలాంటి సంఘటన చోటుచేసుకుంది. చేతికి వచ్చిన మన వళ్ళు ముగ్గురు చనిపోవటం మా కుటుంబాన్ని కుంగి పోయాలే చేసింది. మాకు ఆదరించే వారు లేకుండా పోయారు.

\- కృష్ణమూర్తి, తాత

ఇంటికోసం ఎంతో కష్టపడతారు



పిల్లలు చదువులు మానేసి కష్టపడడం మొదులు పెట్టారు. ఇల్లు కట్టుకోవాలని కుటుంబంఅంతా దురప్రాంతం వెళ్ళి మరి కష్టపడేవారు. పిల్లలు ముగ్గురు మరణించడం ఎంతో బాధగా ఉంది. ఈ మధ్యనే వారికి ప్రభుత్వం ఇంటి స్థలం కూడా ఇచ్చింది.

\- పాపాయమ్మ, చిన నానమ్మ

తాడేరులో విషాదం

భీమవరం రూరల్, జూలై 28: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామశివారులో జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు కుమారులు, వారి తల్లికి గాయాలైన ఘటనతో భీమవరం రూరల్ తాడేరులో విషాదచాయలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన నంగలం కోటయ్య కుటుంబం కాయకష్టాన్ని నమ్ముకుంది. ఎక్కువగా తాపీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తుంటారు. 365 రోజుల పాటు ఎక్కడ ఏపని ఉన్నా ఆ కుటుంబం వెళ్లిపోతోంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో పామాయిల్ గెలలు కోసేందుకు వెళ్లి పది రోజుల అనంతరం శనివారం రాత్రి తాడేరు వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈసారి కోటయ్య మినహా భార్య దుర్గ, ముగ్గురు కుమారులు నర్సీపట్నం వెళ్లారు. రెప్పపాటులో తనువు చాలించారు. కోటయ్య భార్య దుర్గ గాయాలపాలైంది. ముగ్గురు కుమారులు ప్రాణాలు కోల్పోవడంతో ఆ తండ్రి తల్లడిల్లిపోతున్నారు. చిన్నకుమారుడు అఖిల్ భీమవరంలోని గునుపూడి ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు తమ బిడ్డను పని వద్దకు తీసుకుపోతుంటారు. ఈసారి పాఠశాలకు వెళ్లకుండా అఖిల్ తన తల్లి దుర్గతో నర్సీపట్నం వెళ్లి ప్రమాదంలో దుర్మరణం పొందాడు. తల్లిదండ్రులు కోటయ్య, దుర్గలకు తీరని కడుపుకోత మిగిలింది. పాఠశాలకు వెళ్లి ఉంటే అఖిల్ ప్రాణాలతో మిగిలేవాడంటూ తాతయ్య నంగలం కృష్ణమూర్తి కన్నీటి పర్యంత మవుతున్నారు.

కుటుంబం లేకుండా పోయింది..



అనుకోని సంఘటనతో కుటుంబం చిన్నాభిన్నమైంది. ఈ ప్రమాదంతో కుటుంబం అనేది లేకుండాపోయింది. జీవితం ఎలా గడుస్తుందో తెలియడం లేదు. ఉపాధికోసం కుంటుంబం అంతా దూరప్రాంతాలకు వెళ్లి పని చేసుకుని వచ్చే వాళ్లం. ఈసారి వారు వెళ్లారు.. నేను ఇక్కడే ఉండిపోయాను.

\- కోటయ్య, మృతుల తండ్రి

క్రైం కార్నర్

డ్రైవర్ నిద్రమత్తే ప్రాణం తీసింది..

▸ కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. మహిళ మృతి

▸ డ్రైవర్, మృతురాలి కుమార్తెకు గాయాలు


బోల్తా పడిన కారు..


నాగమణి (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 28: డ్రైవర్ నిద్రమత్తుతో ఓ నిండు ప్రాణం బలిగొంది. తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్ల వద్ద ఆదివారం ఉదయం జరిగిన కారు ప్రమాదంలో భీమవరానికి చెందిన పీతల నాగమణి(58) మృతి చెందగా డ్రైవర్, మృతురాలి కుమార్తె గాయాలతో బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. భీమవరానికి చెందిన విశాలి సబ్ ట్రజరీ కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తుంది. తన వ్యక్తిగత పనిమీద నిడదవోలు వెళ్లేందుకు ఆదివారం తెల్లవారుజామున బయల్దేరగా తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్ల వద్ద డ్రైవర్ నిద్రమత్తులో జారుకోవడంతో ముందుగా వస్తున్న లారీని అకస్మాత్తుగా చూసి లారీని తప్పించబోయి రోడ్డుపక్కన ఉన్న బైక్ మెకానిక్ షెడ్‌లో నుంచి కాల్వలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో నాగమణి అక్కడికక్కడే మృతి చెందగా కారు డ్రైవర్, మృతురాలి కుమార్తె విశాలికి గాయాలయ్యాయి. వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాద సమయంలో రోడ్డుపక్కన మెకానిక్ షెడ్‌లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టయింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ దుర్గారావు తెలిపారు.

బిల్లిమిల్లిలో ఒకరి హత్య !

▸ అనుమానాస్పద మృతిగా కేసు


వెంకటేష్ మృతదేహం

కొయ్యలగూడెం, జూలై 28: ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన కొయ్యలగూడెం మండలం బిల్లిమిల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. సీఐ మధుబాబు, స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామంలోని సోదిం వెంకటేష్(49) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నాడు. శనివారం హత్యకు గురైన విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలపడంతో సంఘటనా స్థలాన్ని సీఐ వెళ్లి పరిశీలించారు. మృతుడి మెడపై గాయాలుండడంతో హత్యకు గురైనట్టు భావిస్తున్నారు. ఇద్దరు కుమారుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, జూలై 28 :మోటారు సైకిల్‌పై వెళుతున్న ఒక వ్యక్తిని ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు చిరంజీవి బస్‌స్టాప్ ప్రాంతానికి చెందిన వల్లవు ఆనంద్(22)కు వివాహమైంది. ఆదివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో పోణంగి నుంచి తన ఇంటికి మోటారు సైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రస్తుతం మృతుడి భార్య గర్భవతి. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



దెందులూరు, జూలై 28 : గుండుగొలను సమీపంలో 16వ నంబరు జాతీరహదారిపై ఆదివారం ఓ మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో దంపతులకు గాయాలయ్యాయి. పేదవేగి మండలం దిబ్బగూడెం నుంచి ఆదివారం ఉదయం దంపతులిద్దరూ మోటార్‌సైకిల్‌పై వివాహానికి వెళ్తుండగా సత్యనారాయణపురం దాటిన తరువాత కారు గరుడ హోటల్ సమీపంలో ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పోలీసులు వారిని ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు.

మద్యం మత్తులో బైక్ నడిపిన యువకుడు

▸ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరి మృతి

▸ మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, జూలై 28 : మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు మోటారు సైకిల్‌పై అతివేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న మరో మోటారు సైకిల్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌పై వెనుక కూర్చున్న తమ్ముడు మరణించగా, బైక్ నడుపుతున్న అన్న తీవ్ర గాయాలపాలయ్యాడు. ముగ్గురు వస్తున్న బైక్‌లో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడానికి చెందిన చుండ్రు రమేష్ తన భార్యను, పిల్లలను భార్య పుట్టిల్లు అయిన పినకడిమిలో ఆదివారం సాయంత్రం తీసుకువచ్చి దించారు. తిరిగి ధర్మాజీగూడెం వెళ్తున్న రమేష్ చొదిమెళ్ళలో ఉన్న తన తమ్ముడు చుండ్రు ప్రవీణ్‌కుమార్ (25)ను ఎక్కించుకుని వెళుతున్నాడు. కొత్తూరులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన అఖిల్ అనే యువకుడు అదే కాలనీకి చెందిన కనజం చిన్న, మరో యువకుడు కలిసి మోటారు సైకిల్‌పై విజయరాయి వద్దకు వెళ్లి అక్కడ మద్యం తాగి తిరిగి ఏలూరుకు అతి వేగంగా వస్తున్నారు. విజయరాయి దాటిన తరువాత ఎదురుగా వస్తున్న చుండ్రు రమేష్, ప్రవీణ్ కుమార్ ఉన్న బైక్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే బైక్ నడిపిన అఖిల్, మరో యువకుడు పారిపోయారు. కనిజం చిన్న గాయాలపాలయ్యాడు. మరో బైక్‌పై ఉన్న చుండ్రు రమేష్, ప్రవీణ్ తీవ్ర గాయాలు కాగా వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ప్రవీణ్‌కుమార్ మరణించాడని వైద్యులు ధ్రువీకరించారు. రమేష్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు. మరణించిన ప్రవీణ్‌కుమార్ కారు డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. అతడికి ఇంకా వివాహం కాలేదు. ఈ ఘటనపై పెదవేగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

డ్రగ్స్ పంపించారంటూ వీడియో కాల్

▸ ఆపై బెదిరింపులు.. వారం రోజుల్లో రూ.26 లక్షలు స్వాహా

▸ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

ఏలూరు క్రైం, జూలై 28 : ఏలూరు విద్యానగర్‌కు చెందిన పాము సెల్వరోజలిన్ భీమవరంలోని ఒక కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 18వ తేదీన ఆమెకు ముంబై నుంచి ఒక వీడియో కాల్ వచ్చింది. ఫెడెక్స్ కొరియర్ నుంచి మాట్లాడుతున్నామని ఆమె పేరు మీద విదేశాలకు ఐదు పాస్‌పోర్టులు, ల్యాప్‌టాప్‌లు, డ్రగ్స్ పంపిస్తున్నారని అవి సీబీఐ తనిఖీల్లో పట్టుబడ్డాయంటూ వీడియో కాల్ ద్వారా అక్కడ ఉన్న ప్యాకెట్లను చూపించి భయపెట్టారు. తాము చెప్పినట్లు చేస్తే కేసులు లేకుండా చేస్తామని లేదంటే అరెస్టు చేస్తామని ఎన్నో కేసులు ఎదుర్కొనాల్సి ఉంటుందని బెదిరించారు. ఈనెల 18 నుంచి 24వ తేదీ లోపు రెండు ఖాతాలకు రూ. 25,60,500లను వేయించుకున్నారు. అంతేకాకుండా ఆమెను హౌస్ అరెస్టు చేస్తున్నామని ఒక లెటర్ వాట్సాప్‌కు పంపించారు. ఎవరితోనూ ఫోన్ మాట్లాడకుండా ఉండాలని బెదిరించారు. చివరకు తాను మోసపోయానని భావించిన బాధితురాలు ఆదివారం సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏలూరు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

విద్యార్థినిని కొట్టిన టీచర్‌పై కేసు నమోదు

ఏలూరు క్రైం, జూలై 28 :ఏలూరు సమీపంలో కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న న్యాయవాది ఎం.రవికుమార్ తమ కుమార్తెను ఏలూరులోని సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీషు మీడియం స్కూలులో ఐదో తరగతిలో చేర్పించాడు. ఈనెల 24న ఆ విద్యార్థిని హోమ్ వర్క్ చేయలేదని టీచర్ రాజ్యలక్ష్మి కొట్టారని ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో అదేరోజు సాయంత్రం కుటుంబసభ్యులతో వెళ్లి ప్రిన్సిపాల్‌ను, టీచర్‌ను ప్రశ్నించగా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారంటూ పేర్కొన్నారు. తన కుమార్తె హార్ట్ పేషెంటు అయినప్పటికీ కనికరం లేకుండా టీచర్ కొట్టి బెదిరించారంటూ అదే రోజు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఏలూరు త్రీటౌన్ పోలీసులు సదరు టీచర్ రాజ్యలక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● రవికుమార్‌పై కేసు నమోదు...

న్యాయవాది రవికుమార్ ఈనెల 24న సాయంత్రం సురేష్ చంద్ర పోలీస్ ఇంగ్లీషు మీడియం స్కూలు ప్రిన్సిపాల్ వద్దకు వచ్చి తన కుమార్తెను టీచర్ కొట్టారంటూ ఆమెను పిలిపించాలని కోరడంతో రాజ్యలక్ష్మి అనే టీచర్‌ను ప్రిన్సిపాల్ వెంపటి స్రవంతి పిలిపించారు. ఆ టీచర్‌ను, ప్రిన్సిపాల్‌ను కూడా అవమానకరంగా దుర్భాషలాడారని, దౌర్జన్యంగా భయభ్రాంతులకు గురి చేసే విధంగా న్యాయవాది ప్రవర్తించారంటూ ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేయడంతో రవికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏలూరు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.



మాట్లాడుతున్న ఆంధ్రా సుగర్స్ చైర్మన్ నరేంద్రనాథ్ చౌదరి


సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ఘనంగా హరిశ్చంద్ర ప్రసాద్ జయంతి వేడుకలు

తణుకు, జూలై 28 : దివంగత ఆంధ్రా సుగర్స్ చైర్మన్ డాక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ జయంతి వేడులు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రా సుగర్స్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి ఆధ్వర్యంలో ఆదివారం పలుసేవా కార్యక్రమాలు నిర్వహించి మాట్లాడారు. క్రమశిక్షణ, సమష్టికృషితో సంస్థ పంచాదార తయారీ నుంచి అంతరిక్షయానానికి అవసరమయ్యే ర్యాకెట్ ఇంధనం తయారీ వరకు అభివృద్ధి సాధించిందన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు 400మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ సంస్థకు రక్తదానం చేశారు. కార్యక్రమంలో 25 ఏళ్లు పైబడిన ఒకే సంస్థలో సేవలందించిన వారిని గుర్తించి సత్కరించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వీఎస్ రాజు, డాక్టర్ డి.మంజులత, పి.వెంకటేశ్వరరావు, జీఎస్‌వీ ప్రసాదు, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్ళపూడి నరేంద్రనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పెండ్యాల ఎస్.ఆర్.వి.కె. రంగారావు, సంస్థ జనరల్ మేనేజర్ ఎ.. సాంబశివరావు తదితరులు ఉన్నారు. సన్మానం పొందిన వారిలో గొడపర్తి త్రినాథ్, ముళ్ళపూడి శ్రీనివాసు, చెరుకూరి నగేష్‌కుమార్, కళా వెంకటనాగరవికుమార్, మద్రాపు వెంకటేశ్వరరావుతో పాటు పలు సంస్థలు యూనిట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా ఒకే రేటు అమలు చేయాలి



ఎమ్మెల్యే చంటిని సత్కరిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, జూలై 28: దేశ వ్యాప్తంగా ప్రతి వస్తువును ఒకే రేటుకు అమ్మేవిధంగా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సీహెచ్ కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక నేరెళ్ళ రాజా కల్యాణ మండపంలో అసోసియేషన్ స్థాపించి ముప్పై ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం వేడుకలు, రాష్ట్రసదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహుళజాతి సంస్థల ఒంటెద్దు పోకడల కారణంగా దేశవ్యాప్తంగా ఆయా ఉత్పత్తుల డిస్ట్రిబ్యూటర్లకు గౌరవమర్యాదలు, భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారుల మధ్య సంతృప్తికరమైన వాతావరణాన్ని కేంద్రం తీసుకురావాల్సి ఉందన్నారు. మరో అతిథి ఏలూరు ఎమ్మెల్యే బడేటి బుజ్జి మాట్లాడుతూ హోల్‌సేల్, రిటైల్ వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ఎంటీవీ సత్యకుమార్ మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే బడేటి చంటిని అసోసియేషన్ నాయకులు సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ, కార్యదర్శి సత్యప్రకాష్, నాగేశ్వరరావు, సీహెచ్ రవికృష్ణ, గిరిధర్, పి.శ్రీనివాస్, ఎం.ప్రవీణ్, గురుప్రసాద్, నిమ్మల రాజశేఖర్ తదితరులు, ఇతర రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్ట్

లింగపాలెం/ఆకివీడు, జూలై 28: లింగపాలెం మండలం, ఆకివీడు మండలంలో మొత్తం 12 మంది జూదరులను అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని లింగపాలెం ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1200 నగదు,పేక ముక్కలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆకివీడు మండలం అయి-భీమవరం రోడ్‌లోని స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పేకాటాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని రూ.43,360 స్వాధీనం చేసుకొని, కేసునమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు ఆదివారం తెలిపారు

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

▸ రక్షించిన మత్స్యకారులు, పోలీసులు

నరసాపురం, జూలై 28 : వరదతో ఉధృతంగా ప్రవహిస్తున్న వశిష్ఠ గోదావరిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఒక వ్యక్తిని పోలీసులు, స్థానిక మత్స్యకారులు ఆదివారం ప్రాణాలను కాపాడారు. దాదాపు అరగంట పాటు ఉత్కంఠంగా సాగిన ఈ సాహసంలో చివరికి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ప్రాణాలతో బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ సంఘటకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి.. పట్టణానికి చెందిన 30 ఏళ్ల వయసు గల కె.కృష్ణ కుటుంబ కలహాలతో సాయంత్రం ఆరు గంటల సమయంలో అమరేశ్వరస్వామి గుడివద్ద గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉగ్రరూపం దాల్చిన గోదావరి వేగంగా ప్రవహిస్తుండడంతో క్షణాల్లో కొట్టుకుపోవడాన్ని స్థానిక మత్స్యకారులు రేవుల్లో విధుల్లో ఉన్న పోలీసులు గుర్తించారు. ఆ సమయంలో వరదను తిలకించేందుకు వచ్చిన వందలాదిమంది అతడిని చూసి కేకలు వేశారు. వెంటనే గట్టుపై ఉన్న మత్స్యకారులు, పోలీసులు అమరేశ్వరస్వామి రేవులో ఉన్న పడవలపై కొట్టుకుపోతున్న అతడి వెనుక వెళ్లారు. గోదావరిలో కిలో మీటరు దూరం వెళ్ళిన తరువాత అతడిని పట్టుకుని పడవలో ఎక్కించి ఒడ్డుకు చేర్చారు. ప్రాథమిక చికిత్స చేసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సాహసించిన మత్స్యఆరులు, పోలీసులను స్థానికులు అభినందించారు.


గోదావరిలోకి దూకిన వ్యక్తిని రక్షించేందుకు మత్స్యకారుల గాలింపు.. రక్షించిన దృశ్యం




శాకంబరి అలంకరణలో వరాల నాగమ్మ, అన్నపూర్ణాదేవి

వరాల నాగమ్మకు శాకంబరి అలంకరణ

పాలకొల్లు అర్బన్, జూలై 28 : రాజీవ్ నగర్ కాలనీలో వరాల నాగమ్మ తల్లి జాతర సందర్భంగా ఆదివారం అలయం వద్ద సుమారు 2వేల మంది కి అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని వివిధ కాయగూరలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు.

అన్నపూర్ణాదేవికి శాకంబరి అలంకారం

భీమవరం టౌన్, జూలై 28 : ఆషాఢం సందర్భంగా టూటౌన్‌లోని గొట్టు ముక్కలవారి తోటలో అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవికి శాకంబరీ అలంకారం చేశారు. 11 రకాల కూరగాయలతో అలంకారం చేశారు.

మావుళ్ళమ్మకు 24 గ్రాముల బంగారం అందజేత



భీమవరం టౌన్, జూలై 28 : మావుళ్ళమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన వెంకటేశ్వర బిస్కెట్స్ హోల్‌సేల్ యజమాని వెన్నెంశెట్టి లక్ష్మణరావు, లక్ష్మి దంపతులు 24 గ్రాముల బంగారాన్ని బహూకరించారు. ఆలయానికి వచ్చిన దాతలు ముందుగా అమ్మవారిని దర్శించుకోగా ఆలయ అర్చకుడు కొడమంచిలి కొప్పేశ్వరరావు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఆలయం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ అంద.జేశారు.

'సూర్యనారాయణ సస్పెన్షన్‌లో వాస్తవం లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ఎన్‌రాజు

భీమవరం టౌన్, జూలై 28 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్య నారాయణను సస్పెండ్ చేసినట్లుగా వస్తున్నవార్తలలో వాస్తవం లేదని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జీఆర్‌ఎస్‌ఎన్‌రాజు స్పష్టం చేశారు. ఆదివారంనాడు అంకాల ఆర్ట్స్ అకాడమిలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బైలా ప్రకారం రాష్ట్ర అధ్యక్షుడుని తొలగించే అధికారం కార్యవర్గానికి తప్ప ఎవరికీ లేదని అన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి బీహెచ్ రవీంద్రరాజు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో మెజార్టీ సభ్యులు రాష్ట్ర కార్యదర్శిగా చేస్తున్న అస్కార్‌రావు అసోసియేషన్‌కు వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నట్లుగా రాత పూర్వక ఫిర్యాదులు చేశారని తెలిపారు. మెజార్టీ సభ్యుల ఫిర్యాదు మేరకు బైలాలోని అధ్యక్షునికి ఉన్న అధికారంతో ప్రధాన కార్యదర్శి అస్కార్‌రావును ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగించటం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణకు పూర్తి మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారని జిల్లా కార్యదర్శి పీఎస్ చంద్రమౌళి తెలిపారు.

గర్భిణులకు చీరలు, పౌష్టికాహారం పంపిణీ

భీమవరం టౌన్, జూలై 28: మెంటేవారితోటలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 25 మంది గర్భిణులకు చీరలు, పౌష్టికాహారం, 250 మంది ముంపు బాధితులకు ఆహార పొట్లాలను అందించారు. మాజీ కౌన్సిలర్ ఎద్దు ఏసుపాదం, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ క్యాటరింగ్ వాసు (ఎస్‌ఆర్‌కేఆర్), చంద్రిక మూర్తి ఆర్థిక సహకారంతో 250 మందికి భోజనాలు అందించామని, మా తల్లి మహాలక్ష్మమ్మ పేరిట 25 మంది గర్భిణులకు చీరలు పౌష్టికాహారం అందించామని తెలిపారు. కార్యక్రమంలో కొంద్రు శ్రీనివాస్, బెన్ని తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ముఠా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆకివీడు, జూలై 28 : రైల్వే గూడ్స్ ముఠా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.వీరాస్వామి అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ గూడ్స్ ప్లాట్‌ఫారం దగ్గర ఆదివారం కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. యాభై ఏళ్ళుగా ప్లాట్ ఫారంపై ఎగుమతులు, దిగుమతులు చేస్తూ కాంట్రాక్ట్ దగ్గర పనిచేయడం జరుగుతుందన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటీ, కనీస వేతనం, గుర్తింపు కార్డులు వంటివి ఏమీ అమలు చేయడంలేదన్నారు. ఈ నెల 29న డీఆర్‌ఎం ఆఫీసు దగ్గర జరుగు ధర్నాను జయప్రదం చేయాలన్నారు.

గుంతలు పూడ్చిన టీడీపీ నాయకులు



గుంతలు పూడ్చడానికి దిగుమతి చేస్తున్న సిమెంట్ రాళ్లు

ఆకివీడు, జూలై 28 : సమతానగర్ రోడ్‌లో టీడీపీ శ్రేణులు గుంతలు పూడ్చుతున్నారు. టీడీపీ సీనియర్ నేత గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్,బొల్లా వెంకట్రావు నేతృత్వంలో సిమెంట్ రాళ్లు తీసుకొచ్చి గుంతలు పూడ్చుతున్నారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రకృతిని కాపాడుకోవాలి



హాస్టల్ విద్యార్థులకు మొక్కలు అందించిన దృశ్యం

భీమవరం టౌన్, జూలై 28 : గునుపూడిలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. వార్డెన్లు భానుమణి, శ్యామల మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడానికి నడుం బిగించాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, అరసవల్లి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ అడవులు, జంతువుల పరిరక్షణ కోసం ప్రజలను భాగస్వామ్యం చేయాలని అన్నారు అనంతరం వసతి గృహంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో నరహరిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో రుగ్మతలు దూరం



సీనియర్ పిరమిడ్ మాస్టర్ రత్నమాలను సత్కరిస్తున్న దృశ్యం

పెనుమంట్ర, జూలై 28 : ధ్యానం చేయడం ద్వారా నాడీమండల శుద్ధి జరిగి శారీరక రుగ్మతలు అన్ని తొలగుతాయని విజయవాడకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ యం.రత్నమాల అన్నారు. పెనుమంట్రలో భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు సాయిగీత నిర్మించిన పత్రిజీ పిరమిడ్ ధ్యానమందిరం వద్ద ధ్యాన శిక్షణ నిర్వహించారు. రత్నమాల మాట్లాడుతూ శాకాహారం తినడంవల్ల కలిగే లాభాలు తెలియజేసి గంటసేపు అందరితో సామూహిక ధ్యానం చేయించారు.

గంగాలమ్మకు ప్రత్యేక అలంకరణ



నరసాపురం రూరల్, జూలై 28: ఎల్‌బిచర్ల గ్రామంలో ఆదివారం గంగాలమ్మ కు ప్రత్యేక అలంకరణ చేశారు. చలిమిడి, నైవేద్యాలు సమర్పించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

నేడు పశువైద్య శిబిరం

నరసాపురం రూరల్; జూలై 28: సరిపల్లి గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆశాఖ వైద్యులు డాక్టర్ సురేంద్ర తెలిపారు. దీనికి ఎమ్మెల్యే నాయకర్ విచ్చేస్తారన్నారు. గర్భకోశ వ్యాధుల చికిత్స, నట్టల నివారణ, గోమార్ల, గొంతువాపు, ముద్దచర్మవ్యాధి నివారణ టీకాలు, కుక్కలకు యాంటీర్యాబిస్ వ్యాక్సిన్లు వేస్తామన్నారు.

జనసేన సభ్యత్వ కార్డులు అందజేత



నరసాపురంలో సభ్యత్వ కార్డును అందిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం రూరల్, జూలై 28: నియోజకవర్గంలో పెద్ద ఎత్తున జనసేన సభ్యత్వాల నమోదు చేయనున్నట్లు ఎమ్మెల్యే నాయకర్ తెలిపారు. ఆదివారం మండలంలోని తూర్పుతాళ్ళు గ్రామంలో ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి కార్డులందించారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు నాయకులు వివరించాలన్నారు. వాతాడి ఉమా, ఆకన చంద్రశేఖర్, ఫైలా వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: మార్టేరు గ్రామంలో జనసేనపార్టీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదుకు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సెక్రటరీ చిట్టూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్నవారికి ఐదు లక్షల రూపాయలు ప్రమాద బీమా కల్పిస్తున్నారని తెలిపారు. కాపు జేఏసీ నాయకులు మండెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కష్టాన్నే నమ్ముకున్న హరిశ్చంద్రప్రసాద్



హరిశ్చంద్ర ప్రసాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జూలై 28: డాక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ కష్టాన్నే నమ్ముకుని పారిశ్రామికవేత్తగా కీర్తి ప్రతిష్టలు గడించారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం హరిశ్చంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తణుకు లాంటి మూరుమూల గ్రామంలో ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీని స్థాపించి ప్రపంచ పటంలో తణుకుకు గుర్తింపు తీసుకొచ్చారన్నారు. టీడీపీ నాయకులు కలగర వెంకట కృష్ణ, పితాని మోహన్, మంత్రిరావు వెంకటరత్నం, తమరాపు రమణమ్మ, గుబ్బల శ్రీనివాసు, ఒమ్మి రాంబాబు, వల్లూరి గంగయ్య, గుమ్మళ్ళ హనుమంతు, తమరాపు పల్లపరావు, చింతపూడి సన్యాసిరావు, తాతపూడి మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

అత్తిలి, జూలై 28: గత ప్రభుత్వం డ్రెయినేజీల నుంచి సిల్ట్ తొలగించకపోవడంతో డ్రైనేజీలు నిండిపోయి పొలాలు ముంపునకు గురవుతున్నాయని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అత్తిలి మండలంలోని పలు గ్రామాల్లో నీటమునిగిన పంటపొలాలను ఆయన ఆదివారం పరిశీలించారు. పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

ఆర్‌ఎంపీ వైద్యుడు సుగుణరావు మృతి

నరసాపురం రూరల్, జూలై 28: లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యులు గొగులమండ సుగుణరావు(67) మృతి చెందారు. ఆయన పార్థవదేహాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు సందర్శించి నివాళలర్పించారు. ఆయన మృతి తీరని లోటని, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

ఉచిత వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హుస్సేన్

తణుకు, జూలై 28: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా అందించే ఉచిత వైద్య సేవలను ఆదివారం నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్ర తణుకు, వేల్పూరు ప్రాంతాల్లో పర్యటించి ఏడుగురుకి ఉచిత వైద్య సేవలందించారు. సంఘ సభ్యుడు రవి రెజనాల్డ్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ కార్యదర్శి ఎండీ స్వాలిహా, కోశాధికారి ఆర్థి భాస్కరరావు, సభ్యుడు గిరజాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తణుకు, జూలై 28: సమాజ సేవలు సంతృప్తికరంగా ఉండాలని దంత వైద్యుడు డాక్టర్ దాట్ల సత్యనారాయణ రాజు అన్నారు. మానవత ఆధ్వర్యంలో తేజశ్రీ అనే బీటెక్ విద్యార్థినికి రూ. పదివేలు ఆర్థిక సాయాన్ని పట్టణానికి చెందిన ఆచంట ఫణికుమార్ దంపతులు ఆదివారం రోటరీ క్లబ్‌లో అందజేశారు. అనంతరం ఒలింపిక్స్‌లో దేశం తరపున పాల్గొంటున్న జ్యోతిక తల్లిదండ్రులను సన్మానించారు. సంఘ అధ్యక్షులు కటారి శారదాదేవి, విశాఖ సెంట్రల్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి, అక్కపంతులు బాలాజీ, వీవీ రామకృష్ణారావు, ఎస్‌వీ సతీష్‌బాబు, రామలక్ష్మి పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంఘ వార్షికోత్సవం



కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 28: తాడేపల్లిగూడెం రంగస్థల కళాకారుల సంఘ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ అధ్యక్షతన కళాకారులు తమ కళలను ప్రదర్శిస్తూ ఆహుతులను ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైద్యుడు నార్ని బావాజి మాట్లాడుతూ రంగస్థల కళాకారులకు తమ ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందిస్తామన్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడు కె. మృత్యుంజయరావు, అంతర్జాతీయ మహిళా శిల్పి దేవికారాణి ఉడయార్, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ మాట్లాడారు.



సీతారామయ్యను సన్మానిస్తున్న క్రీడాకారులు

జ్యోతికశ్రీ విజయం సాధించాలి

తణుకు, జూలై 28: ఒలింపిక్స్‌లో పట్టణానికి చెందిన అథ్లెట్ జ్యోతికశ్రీ విజయం సాధించాలని పలువురు ఆకాంక్షించారు. ఆదివారం జ్యోతికశ్రీ ప్రథమ గురువు సీతారామయ్యను తణుకు టౌన్ హాలు ఇండోర్ స్టేడియంలో సన్మానించారు. పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

గుడ్లు తేలేయాల్సిందే

అంగన్‌వాడీలకు చిన్నసైజు గుడ్లు సరఫరా

అత్తిలి, జూలై 28 : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు చిన్నవి సరఫరా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషక విలువలు బాగుండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేస్తోంది. కాంట్రాక్టరు ఒప్పందాలను కాలరాసి ఇష్టానుసారంగా చిన్నసైజు గుడ్లు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలతో లబ్ధిదారులు వాదనకు దిగుతున్నారు.

40 గ్రాములే గుడ్డు బరువు

అంగన్‌వాడీలకు ఇచ్చే ట్రేలో 30 గుడ్లు పడతాయి. ఆ ట్రే బరువు 1500 గ్రాములు ఉండాలి. గుడ్డు బరువు 50 గ్రాములకు మించి ఉండాలి. అయితే ఒక్కొక్క గుడ్డు 40 గ్రాముల బరువు కూడా ఉండడం లేదని గర్భిణులు, బాలింతలు వాపోతున్నారు. ఈ గుడ్లను తింటే పోషకాహారం మాట అటుంచి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వాపోతున్నారు. నాణ్యమైన పెద్దగుడ్లను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన టీచ్ టూల్స్ ప్రోగ్రాం



ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో వీరాస్వామి

పాలకొల్లు అర్బన్, జూలై 28 : బీఆర్‌ఎం వీఎం హైస్కూల్లో 9 రోజులుగా జరుగుతున్న టీచ్ టూల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఆదివారంతో ముగిసింది. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఈవో గుమ్మళ్ళ వీరాస్వామి మాట్లాడుతూ శిక్షణ పొందిన 110 మంది ఉపాధ్యాయులు ఆయా పాఠశాలలకు వెళ్ళి బోధన అభ్యాస కృత్యాలను తరగతి గదుల్లో పరిశీలించి ప్రభుత్వం నిర్ణయించిన యాప్‌ల్లో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన టెస్టుల్లో పాసైన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా కోర్సు కో ఆర్డినేటర్‌గా వ్యవహరించిన ఎంఈవో వీరాస్వామిని ఉపాధ్యాయులు సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో (2) ఆర్‌ఎన్‌ఎస్‌విజీ శర్మ, ఆర్పీలు నరేష్, లక్ష్మీనారాయణ, నరసింహ రాజు, మూర్తి పాల్గొన్నారు.

ముంపు బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



గణపవరం, జూలై 28: వైసీపీ ప్రభుత్వం కాల్వలు, డ్రెయినేజీ వ్యవస్థను ఆధునికీకరించకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని గణపవరం మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు ఆరోపించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు యనమదుర్రు డ్రెయిన్ వరద కారణంగా పిప్పరలో ముంపు బారిన పడిన సుమారు 444 మంది బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు నూనె, నిత్యావసరాలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి ఏసుబాబు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మానవత సేవలు మరింత విస్తృతం

గణపవరం, జూలై 28: సమాజసేవలో మానవత స్వచ్ఛంద సంస్థ నూతన కమిటీ ఆధ్వర్యంలో మరిన్ని విస్తృత సేవలు చేస్తామని ఆ సంస్థ అధ్యక్షుడు ముద్దారపు పుల్లయ్య తెలిపారు. ఆదివారం గణపవరంలో మండల మానవత విస్తృత సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని సేవలను, విద్యావైద్యం, ఫీజర్లు వంటి సౌకర్యాలు ప్రజలకు అందించేందుకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మానవత నాయకులు కాళ్ళకూరి సత్యనారాయణమూర్తి, గంటా అన్నవరం, పేరుమాళ్ళ ఆంజనేయులు, మద్దాల రామకృష్ణ పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం

పెంటపాడు, జూలై 28: మానవత సేవలు అభినందనీయమని ఎంఈవో-2 టీవీ రామకృష్ణ అన్నారు. మండలంలోని బోడపాడు గ్రామంలో ఆదివారం సంస్థ మండల అధ్యక్షుడు మీసాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంస్థ జిల్లా విద్యాకమిటీ కన్వీనర్ తాడేపల్లి మోహన్‌రావు మాట్లాడుతూ మానవత సేవలను మారుమూల ప్రాంతాల్లో కూడా విస్తరిస్తున్నామని, సభ్యత్వాల సంఖ్య పెంచి ప్రజలంతా సహకరించాలని కోరారు. సర్పంచ్ గేదెల శివకుమార్, తాడేపల్లి మోహన్‌రావు, తారాడి పాల్ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల వితరణ

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 28: తాడేపల్లిగూడెం ఇలవేల్పు బలుసులమ్మ వారికి శాకంబరిగా అలంకరించిన కూరగాయలను ఆలయ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఆలయంలో సేవ చేసే వలంటీర్లకు పంపిణీ చేశారు. తొలుత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. దాట్ల జగన్నాథరాజు, నీలం సురేష్, చవాకుల రమణ, ముఖేష్, కాళ్ళ గోపి, సుంకర ధనబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య సెల్ టవర్ వద్దంటూ నిరసన



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 28: ఇళ్ల మధ్య నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్ నిర్మిస్తున్నారంటూ మహాలక్ష్మి నగర్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మహాలక్ష్మి నగర్ రోడ్డు నంబర్-3లో ఆదివారం సెల్ టవర్ ఏర్పాటుకు ప్రయత్నించడంతో స్థానికులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గతంలో ఇళ్ల మధ్య సెల్ టవర్ వేస్తుండటంతో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దని నిర్వాహకులను హెచ్చరించారని మళ్లీ టవర్ ఏర్పాటుకు ప్రయత్నించడం ఏమిటని ప్రశ్నించారు. టవర్ ఏర్పాటు విరమించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. షేక్ లాల్ బాషా, టి. మురళీకృష్ణ, ఎంఎస్ రెడ్డి, ఎం. దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఆచంట, జూలై 28: ఆచంట శివారు మానేవారిపాలెం నుంచి వంగతాళ్ల చెరువుకు రూ. కోటి 8 లక్షలతో సిమ్మెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పితాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పాడైన రహదారులకు నిధులు మంజూరు చేసి అన్ని రహదారులను నిర్మించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, గొడవర్తి శ్రీరాములు, తమ్మినీడి ప్రసాద్, కేతా మీరయ్య, కేతా పూలే, కేతా మురళి, ఎంపీటీసీ సబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా ఇవాంజెలికల్ ఫెలోషిప్ వేడుకలు

భీమవరం టౌన్, జూలై 28 : బలుసుమూడి లెమెన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ 89వ వార్షికోత్సవ స్తుతి ఆరాధన పాస్టర్ జయంత రావు అధ్యక్షతన ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ స్తుతి ఆరాధనకు ముఖ్య ప్రసంగీకులుగా డానియేల్ దామోదర్ (చెన్నై) వర్తమానమందించారు. ఈ కార్యక్రమంలో పిల్లల యాక్షన్ సాంగ్స్ పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇ. నిర్మలా జయంత్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నాటిక ఆకట్టుకున్నది.

రత్నమాలకు గౌరవ డాక్టరేట్

ఆచంట, జూలై 28: ప్రముఖ సంఘ సేవకురాలు ఆచంట మండలం భీమలాపురానికి చెందిన కొత్త కనక రత్నమాలకు డాక్టరేట్ లభించింది. తమిళనాడు రాష్ట్రంలోని ఓసూరి ఏసీఎస్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ ఆమె 45 సంవత్సరాల్లో వివిధ రంగాల్లో అందిస్తున్న సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.

పోటాపోటీగా స్వర్ణకార సంఘ ఎన్నికలు

తణుకు, జూలై 28: తణుకు స్వర్ణకార సంఘం ఎన్నికలు స్థానిక మెడికల్ హాలులో ఆదివారం పోటాపోటీగా జరిగాయి. నాగమల్లి సాంబశివరావు, పొదుగు రామాచారి పోటీపడగా సాంబశివరావు గెలుపొందినట్టు జిల్లా ఎన్నికల అధికారి పట్నాల శేషగిరి ప్రకటించారు. అధ్యక్షులుగా సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా కోరుమిల్లు సుబ్బారావు ఎన్నికయ్యారు.

పూడుకుపోయిన డ్రెయిన్లు



పాలకొల్లు అర్బన్, జూలై 28 : పట్టణంలోని 21వ వార్డులోని ఎన్టీఆర్ విగ్రహం పక్కన ఉన్న చిన్న సందులో డ్రెయినేజీ పూడుకుపోవడంతో మురుగు నీరు పారుదల లేక రోడ్డుపైనే మురుగునీరు చేరుతున్నది. చిన్నపాటి వర్షం వచ్చిన డ్రెయిన్ మురుగు నీటిలోనే నడిచి వెళ్ళవలసి వస్తోందని వార్డు ప్రజలు చెబుతున్నారు. కనీసం మురుగు డ్రెయిన్లలో శిల్టును తీయించాలని అధికారులను వార్డు ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా పట్టణంలోని పలువార్డుల్లో మురుగుడ్రెయిన్లు పిల్టుతో నిండి పోయి ఉన్నాయి.

అమ్మవార్లకు ఆషాఢ సారె



పెంటపాడు, జూలై 28: ప్రత్తిపాడు దుర్గమ్మ, గండి పోచమ్మ, అంకాలమ్మ వార్లకు గ్రామ మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. తొలుత గ్రామం నుంచి మేళతాళాలు, కోలాట నృత్య ప్రదర్శనలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్ళారు. అనంతరం ప్రత్తిపాడు వై.జంక్షన్ దుర్గమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఈవో శ్రీదేవి ఏర్పాట్లు పర్యవేక్షించారు

బండి ముత్యాలమ్మకు భక్తుల తాకిడి



బండి ముత్యాలమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు

మొగల్తూరు, జూలై 28: ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన ప్రాంతంతో పాటు సరిహద్దు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం వారి మొక్కుబడులైన దూపహారం, కుంభహారాలను అమ్మవారికి నివేదించారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మీ వద్దకు వచ్చి సమస్య పరిష్కరిస్తా: మంత్రి నిమ్మల



అన్న క్యాంటీన్ నిర్వహణకు లక్ష రూపాయల చెక్కును మంత్రికి అందిస్తున్న చాంబర్ సభ్యులు

పాలకొల్లు అర్బన్, జూలై 28 : 'పాలకొల్లు నియోజక ప్రజల ఆశీస్సులతోనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను, అందువల్ల నియోజకవర్గ శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తాను, మీరు మీ సమస్యల నిమిత్తం నావద్దకు రావద్దు, నేనే మీవద్దకు వచ్చి సమస్య పరిష్కరిస్తా' అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు మంత్రి రామానాయుడును స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఆదివారం లయన్స్ క్లబ్‌లో సత్కరించారు. ఈకార్యక్రమానికి ఛాంబర్ అధ్యక్షుడు కేవీఆర్ నరసింహారావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఛాంబర్ తరఫున మంత్రి నిమ్మలకు పలు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభించనున్న అన్న క్యాంటీన్ నిర్వహణకు చాంబర్ తరఫున లక్ష రూపాయల చెక్కును మంత్రి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. కార్యక్రమంలో ఛాంబర్ కార్యవర్గ సభ్యులు కేవీ సీతారామరాజు, పెద్దిబోట్ల లక్ష్మీనారాయణ, గుణ్ణం సర్వారావు, కలిదిండి రామరాజు, దేవరపు లక్ష్మీనారాయణ, ఛాంబర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తా

పాలకొల్లు అర్బన్, జూలై 28 : రాష్ట్రంలో సహకార సంఘాలు మరింత బలోపేతం చేయడం ద్వారా రైతన్నలకు తోడుగా ఉంటానని రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఏఎంసీ ఆవరణలో ఆదివారం జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల సంఘాల మహాజన సభకు ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జగన్ 5ఏళ్ళుగా సహకార సంఘాలు, రూరల్ బ్యాంక్‌లను నిర్వీర్యం చేశారని అన్నారు. సహకార సంఘాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.



ముత్యాలపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

'పొత్తూరిని మార్చాల్సిందే'

మొగల్తూరు, జూలై 28: నరసాపురం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజును మార్చాల్సిందేనంటూ మొగల్తూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం ముత్యాలపల్లిలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సుమారు 80 మంది కార్యకర్తలు, నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో మొగల్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు బస్వాని ఏడుకొండలు, అయితం చందు, పులపర్తి త్రిమూర్తులు, బందన నాగార్జున, కవురు రంగ తదితరులు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ కలిగిన తమపై రామరాజు వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. పార్టీ కార్యక్రమాలు సమాచారం తమకు ఇవ్వడం లేదంటూ మండిపడ్డారు. శనివారం మొగల్తూరులో జరిగిన మండల టీడీపీ సమావేశానికి తమకు సమాచారం లేదని పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు పుట్టిన రోజు వేడుకల కోసమే పార్టీ మీటింగ్ పెట్టారని ఆరోపించారు.

పార్టీకోసం పనిచేసే వారికి గుర్తింపు

మొగల్తూరు, జూలై 28: తెలుగుదేశం పార్టీకోసం కష్టించి పని చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఇస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు తెలిపారు. శనివారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన మండల టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ అధినేత సూచనలు పాటిస్తూ కూటమి ప్రభుత్వం వచ్చేందుకు తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు ఎంతగానో కృషి చేశారన్నారు. ప్రతీ కార్యకర్త, అభిమాని ఇకపై ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు.

ఘనంగా పుట్టినరోజు వేడుకలు

మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ గుబ్బల నాగరాజు జన్మదిన వేడుకలు మండల పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. నరసాపురం నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని నాగరాజుతో జన్మదిన కేక్ కట్ చేయించారు.

వాకర్స్ ఉద్యమంలో భాగస్వాములు చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 28: వాకర్స్ ఉద్యమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములు చేయాలని వాకర్స్ జిల్లా గవర్నర్ వై. సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ భవనం వద్ద ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. క్లబ్‌ల నిర్వహణపై సమీక్షించారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వి. మురళీమోహన్, మాజీ ప్రెసిడెంట్ సీహెచ్ సీతారామయ్య, జిల్లా కార్యదర్శి వి. నాగేంద్ర ప్రసాద్, తాడేపల్లిగూడెం వాకర్స్ అధ్యక్షుడు దూలం నాగరాజు మాట్లాడారు.

అత్తిలిలో బోనాల ఉత్సవం

అత్తిలి, జూలై 28 : ఆషాఢం సందర్భంగా బోనాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. రామన్నపేట డిగ్రీ కళాశాల శ్రీ శక్తి మహంకాళి పీఠం నుంచి ఊరేగింపుగా విజయ చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించారు రామన్నపేటకు చెందిన గాది మంగామణి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.